క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ప్రకాష్‌నగర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మెన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాలు, ఆర్‌బీఐ ఎదురు లైన్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ, ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శనివారం నిర్వహిస్తున్నట్లు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ ఆవరణలోని గ్రీన్‌ల్యాండ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక శిబిరం కొనసాగుతుందన్నారు. వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, సరఫరాలో ఇబ్బందులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఏసీపీ వెంకటేశ్వర్‌రావును సన్మానించిన పాలక మండలి సభ్యులు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావును బల్కంపేట ఎల్లమ్మ పాలక మండలి సభ్యులు గురువారం కలిసి సన్మానించారు. ఇటీవల ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ రామప్రసాదరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కొమురయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రఘురామ్, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ బాలరాజుయాదవ్‌ను కలిసి అమ్మవారి ప్రసాదాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కూతురు నర్సింహ, సరాఫ్ సంతోష్, సురేష్‌గౌడ్, రోజారెడ్డి, యాదగిరి గుప్తా పాల్గొన్నారు.

మంత్రిని కలిసి అధికారులు



మంత్రితో సీఐ భాస్కర్

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ డీఎంసీగా బాధ్యతలు చేపట్టిన జగన్ గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా బదిలీపై బేగంపేట సీఐగా వచ్చిన భాస్కర్, గోపాలపురం ట్రాఫిక్ సీఐ సైదులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలువగా శుభాకాంక్షలు తెలిపారు.

శంకరయ్యకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థి సంకు శంకరయ్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. కొంపెల్లిలోని శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు ఎస్‌ఎ.ఎఫ్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న వృత్తిపరమైన సామాజిక కార్యకర్తలతో ఉద్యోగ ఒత్తిడి, బర్నౌట్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు.

తవ్వి వదిలేసిన రోడ్డును వేయాలి



ఎస్‌ఆర్‌టీలో రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ ఎస్‌ఆర్‌నగర్ ఎస్‌ఆర్‌టీలో అభివృద్ధి పనుల పేరుతో రోడ్డు తవ్వి తిరిగి వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు విజయ ఆరోపించారు.గురువారం స్థానికంగా పర్యటించిన ఆమె రోడ్డుపై పడ్డ గోతులను పరిశీలించి మహిళలతో మాట్లాడారు. పైప్‌లైన్ పనులు పూర్తి కాని కారణంగా రోడ్డును అలాగే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌గౌడ్, దశరథ్, ఉత్తమ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డంతా పార్కింగ్!

- పార్కింగ్ ప్రదేశాలుగా మారుతున్న ప్రధాన రహదారులు
- బహుళ అంతస్తుల భవనాలకు లేని పార్కింగ్
- ఫిర్యాదు చేస్తున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



రహదారిపై నిలిపిన వాహనాలు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని నివాస ప్రాంతాలు ఇప్పుడు వాణిజ్య ప్రాంతాలను తలపించేలా మారిపోయాయి. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతం రోడ్లు ఇప్పుడు వాహనాల పార్కింగ్‌లతో నిండిపోయి గజిబిజిగా తయారైంది. ప్రధాన రహదారులు వాహనాల పార్కింగ్‌లతో నిండిపోయి చిన్న ఆటో వెళ్లాలన్నా కూడా కష్టంగా మారింది. రోజు రోజుకు రోడ్డుపైకి వచ్చే వాహనాల సంఖ్య పెరిగిపోతుండటం, మరో వైపు ఆ వాహనాలు పార్కింగ్‌కు సరిపడే ప్రదేశాలు లేకపోవడంతో ఇక్కడ ట్రాఫిక్ జంజాటం తప్పడం లేదు. దీనికి తోడు ప్రతి నిత్యం వాహనాల రాకపోకలతో స్థానికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

పార్కింగ్ లేకుండా భవనాల నిర్మాణాలు..

బౌద్ధనగర్ డివిజన్‌లోని వివిధ కాలనీలు, బస్తీల్లో ఒకప్పుడు ఇండిపెండెంట్ ఇళ్లే కనిపించేవి. కానీ నేడు చిన్నచిన్న స్థలాల్లో కూడా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. డివిజన్‌లోని ఎల్ నారాయణనగర్, బౌద్ధనగర్, అల్లాడి రాజ్‌కుమార్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల భారీ సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. దీనికి తోడు కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా దానికి అనుగుణంగా పెరిగింది. అయితే ఇక్కడ ఉండే రోడ్లు మాత్రం కొన్ని దశాబ్దాల క్రితం నాటివే ఉన్నాయి. బహుళ అంతస్తుల భవనాల్లో నివాసముండే వారికి అనుగుణంగా పార్కింగ్ సదుపాయం లేక రోడ్ల మీదనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కేవలం 20 అడుగుల రోడ్డులో ఇరువైపులా కార్లు నిలుపుతుండటంతో కనీసం ఆటోలు కూడా వెళ్లే పరిస్థితి లేదు. రాత్రి వేళల్లో, సెలవు రోజుల్లో వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్లకు ఇరువైపులా నిలిపివేస్తుండటంతో మరిన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎప్పుడైనా ఏదైనా ప్రమాదం జరిగినా, అంబులెన్సు రావాలన్నా గంటల తరబడి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపై ఉండే వాహనాలతో పలుమార్లు రోడ్డున వెళ్లే వాహనదారులు గొడవలకు దిగుతున్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయం కల్పించాలి..



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య పెరిగిపోతుంది. అయితే ప్రస్తుతం వచ్చిన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చిన మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాన్ని ఉస్మానియా యూనివర్సిటీ, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు ఒక పరిష్కారం లభించినట్లు అవుతుంది.

–శ్రీనివాస్, బౌద్ధనగర్

రోడ్లపై పార్కింగ్ చేస్తే చర్యలే..



రోడ్లపై ఇరువైపులా పార్కింగ్ చేయరాదు. నిబంధనలు ఉల్లంఘించి పార్కింగ్ చేస్తూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేస్తాం. ఎవరి సొంత ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలి. రోడ్లపై పార్కింగ్ చేస్తున్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

–సీహెచ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. బోయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఐడీహెచ్ కాలనీ బస్తీ దవాఖానా సిబ్బంది కలిసి పలు పాఠశాలల విద్యార్థులకు ఈ మందులను పంపిణీ చేశారు. బోయిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత నులి పురుగుల మందులను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి నులి పురుగుల నివారణ మందులను వేయించాలని కోరారు. ఐడీహెచ్ కాలనీలో స్థానిక నాయకులు వెంకటేషన్ ఆల్బెండజోల్ మందులు వేశారు.

అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో..

బౌద్ధనగర్: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశోక్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శరీరంలో నులి పురుగులు ఉండడంతో పిల్లలకు అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. వాటి నివారణకు మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎలిజబెత్, బీఆర్‌ఎస్ నేతలు కంది నారాయణ, శైలేందర్ పాల్గొన్నారు.

దళిత, బీసీలబంధు ఎంపిక కలెక్టర్లు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: పేద వర్గాలైన దళిత, బీసీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న దళిత, బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతలను తొలగిస్తూ పేద వర్గాలైన దళితులకు ఆర్థికంగా చేయూతనిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో ఎమ్మెల్యేల జోక్యంతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రే స్పష్టం చేశారని గుర్తు చేశారు. రెండో విడత దళిత బంధు, బీసీ బంధు ఎంపికలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా కలెక్టర్ల ద్వారా ఎంపిక జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో కొమురెల్లి బాబు, జేరిపోతుల కుమార్, పాకాల యాదగిరి, షేక్ లతీఫ్, గౌరీ నాగరాజు, యాదగిరి, రాములు, రమేష్, లక్ష్మణ్, భిక్షపతి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సాయన్న కుమార్తెలు



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో లాస్య నందిత, నివేదిత

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసాతో సాయన్న కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాయన్న సంతాప తీర్మానం సందర్భంగా శాసనసభకు వెళ్లిన సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. శాసన సభ సాయన్నకు ఘన నివాళి అర్పించడంతో పాటు ఏకంగా సీఎం సాయన్న కుటుంబం మా కుటుంబం అంటూ చెప్పడంతో సాయన్న వర్గీయులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే సాయన్న వారసులకే బీఆర్‌ఎస్ టికెట్ వచ్చే అవకాశముందని ఆశాభావంతో ఉన్నారు. శాసన సభ ముగిసిన అనంతరం జరిగిన పరిణామాలతో ఈ ఆశలు మరింత పెరిగాయి. సాయన్న సతీమణి గీతకు సైతం అధిష్ఠానం నుంచి పిలుపు రావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

ముంపు సమస్యను పరిష్కరించండి



సీఈవో మధుకర్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీల సభ్యులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రెండు మూడు వార్డుల పరిధిలో ముంపు సమస్యలను పరిష్కరించాలని వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు గురువారం బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతిఏటా వర్షాకాలంలో మూడో వార్డు పరిధిలోని విమాననగర్ కాలనీ, పైగాకాలనీ, రెండవ వార్డు పరిధిలోని బీహెచ్‌ఈఎల్ కాలనీ, అవంతి కో–ఆపరేటివ్ సొసైటీ, లక్ష్మిగుంటి కాలనీ, మార్గదర్శి కాలనీలు ముంపునకు గురవుతున్నాయని సీఈవోకు వివరించారు. ప్యాట్నీ నాలా గతంలో 70 ఫీట్లకు ఉండగా కబ్జాకు గురై 15 ఫీట్లకు కుంచించుకుపోయిందని దీనివల్ల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వెనక్కి ప్రవహిస్తుండడంతో కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. కబ్జాలను తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, అవినాష్ బండారి, సురేందర్ గౌడ్, శ్రీనివాస్, పవన్‌బిడే, లక్ష్మినారాయణ రాము, రంగారావు పాల్గొన్నారు.

'చలోఢిల్లీ'కి రైల్వే కార్మికులు తరలిరావాలి

సికింద్రాబాద్: ఢిల్లీలో ఈ నెల 10న జరిగే పార్లమెంట్ మార్చ్‌కు రైల్వే కార్మికులు తరలిరావాలని మజ్దూర్ యూనియన్ జోనల్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. 2003లో అప్పటి బీజేపీ ప్రభుత్వం మోసపూరితంగా ఆర్డినెన్స్ ద్వారా భవిష్యత్ నియామకాల కోసం పెన్షన్ సర్వీస్‌ను రద్దు చేసిందన్నారు. 2013లో కాంగ్రెస్ పెట్టిన పీఎఫ్ఆర్‌డీఏ బిల్లుకు బీజేపీ మద్దతు తెలిపిన ఎన్‌పీఎస్ బిల్లు పాస్ చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరూ ప్రభుత్వం అమలు చేసిన అన్యాయమైన ఎన్‌పీఎస్‌తో బాధపడుతున్నారని, వారి పదవీ విరమణ అనంతరం వారి జీవితం చీకటిగా మారిందన్నారు. ఉద్యోగులపై ప్రభుత్వం విధించిన ఈ అన్యాయమైన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఏఐఆర్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా, మార్గదర్శకత్వంలో ఓపీఎస్ అమలు కోసం పోరాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామన్నారు. ఆగస్టు 10న పార్లమెంట్ చుట్టుముట్టడంతో పాటు, అన్ని రైల్వేలు, భారత ప్రభుత్వ ఉద్యోగులందరితో రాంలీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పర్మనెంట్ కోసం అధ్యాపకుల పోరుబాట



దీక్ష చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు పోరుబాట పట్టారు. గురువారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి సిద్ధిపేటలోని వేంకటేశ్వర్ల టెంపుల్ వరకు పాదయాత్ర చేపట్టారు. పర్మనెంట్ కోసం అనేక ఆందోళన కార్యక్రమాలు, విన్నపాలు చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జేఏసీ చైర్మన్ శ్రీధర్‌కుమార్, వర్కింగ్ చైర్మన్ రామేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మరో నేత వేల్పుల కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ గేటు వద్ద రిలే నిరహారదీక్ష చేపట్టారు. అసెంబ్లీ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్య పరిష్కారం అయ్యే వరకు రిలే నిరహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.

త్వరలో ఓయూలో వీ-హబ్ ఏర్పాటు



దీప్తిరావుకు జ్ఞాపిక అందచేస్తున్న రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో త్వరలో వీ-హబ్ ఏర్పాటు చేయనున్నారు. గురువారం వర్సిటీ క్యాంపస్‌లో వీ-హబ్ సీఈవో దీప్తిరావు నేతృత్వంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఇతర అధికారులతో సమావేశమయ్యారు. గతవారం వీ-హబ్‌ను సందర్శించిన వీసీతోపాటు వర్సిటీ అధికారుల బృందం ఓయూలోనూ వీ-హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరడంతో త్వరలో క్యాంపస్‌లోని సీఎఫ్ఆర్డీ (రౌండ్ బిల్డింగ్)లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నిజామాబాద్‌కు చెందిన హన్మండ్లు (50) గుండ్ల పోచంపల్లిలో స్థిరపడి మంగళి పని చేస్తున్నాడు. ఈ నెల 3న గుండ్ల పోచంపల్లి-బొల్లారం రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

100 పడకల ఆస్పత్రిని నిర్మించాలి



అడ్డగుట్ట చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని సీపీఎం హైదరాబాద్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం అడ్డగుట్ట చౌరస్తాలో సీపీఎం నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడ్డగుట్టలో 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో రెండు సార్లు ఆస్పత్రి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన నాయకులు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మారేడుపల్లి మండల పరిధిలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలన్నారు. అదే విధంగా ఇంటర్, డిగ్రీ కళాశాలలు, కల్యాణ మండపం కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అజయ్ బాబు, బాలయ్య, ఆర్. మల్లేష్, మహేందర్, వీరలక్ష్మి, గోపాల్, అంజమ్మ, కిరణ్, బీమయ్య, ప్రభాకర్, లలిత, పూలమ్మ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులు

సనత్‌నగర్: నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం ద్వారానే భవిష్యత్‌లో తమకు తాము ఉన్నతంగా ఎదగడంతో పాటు తోటి వారికి కూడా తోడ్పాటు అందించగలుగుతారని వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్‌లో గురువారం జరిగిన ఇన్వెస్టిచర్ (నాయకత్వ బాధ్యతల స్వీకరణ మహోత్సవం) అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగు పడతాయన్నారు. విద్యార్థులు రేపటి తరానికి నాయకులుగా ఎదిగినప్పుడే సమాజ వికాసం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రకళాయాదవ్, ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జెడ్సీ రవికిరణ్‌కు కార్మికుల సమస్యలను వివరిస్తున్న బీఎంఎస్ నాయకులు

సికింద్రాబాద్: కార్మికులకు ఎలాంటి ఆపద వచ్చినా వాటిని పరిష్కరించేందుకు భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అండగా ఉటుందని బీఎంఎస్ అధ్యక్షులు రాజేశ్వరరావు అన్నారు. గురువారం యూనియన్ నాయకులు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఎన్. రవి కిరణ్‌ను కలిసి మాట్లాడారు. రెగ్యులర్ జవాన్లను నైట్ డ్యూటీలు, స్లీపింగ్ మిషన్ మానిటరింగ్, జీవీపీ మానిటరింగ్ చేయాలని అదనపు భారం వేస్తున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా కార్మికులకు రావాల్సిన ఇంక్రిమెంట్లు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, ఉద్యోగుల సమస్యలపై చర్చించగా జెడ్సీ సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రాజు, శంకర్, బాగేష్, నర్సింగ్, వసంత్, సుజిత్, బాలకృష్ణ, వెంకట్, కిషన్ సింగ్, గణేష్, శివ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 13న కోరుట్లలో జరిగే పద్మశాలి ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు రామ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పున్న కైలాష్‌నేత కోరారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని రంగాలలో వెనుకబడిన పద్మశాలీలకు జనాభాను బట్టి సర్పంచ్ నుంచి ఎంపీ వరకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వివిధ పార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, బూర మల్లేష్, ఓయూ నాయకులు రాజునేత, బాలకృష్ణనేత, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ పాల్గొన్నారు.

వారాసీగూడలో..

బౌద్ధనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దామాషా ప్రకారం పద్మశాలి సంఘానికి చెందిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం తాత్కాలిక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం వారాసీగూడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ ఆధ్వర్యంలో 'చలో కోరుట్ల' పద్మశాలి రాజకీయ యుద్ధభేరి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎమ్మార్పీఎస్ సన్నాహక సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాగటి సత్యం మాదిగ

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 4న జరిగే హైదరాబాద్ జిల్లా సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ కోరారు. గురువారం తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, అజిత్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా సన్నాహక సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జన్నపాల మహేష్ మాదిగ, మంద మధుకర్, శ్రీకాంత్, సునీల్ బ్యాగరి నరసింహ, ఉత్తరయ్య పాల్గొన్నారు.

బస్తీ సమస్యలపై పాదయాత్ర



చెత్తను చూపిస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: స్థానిక సమస్యలను పరిష్కరించడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక బస్తీల్లో కలుషిత నీటి సరఫరా అవుతున్నాయని, నూతన తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి సమస్యను పరిష్కరిచాలన్నారు. అలాగే వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండకుండా చెత్తా చెదారంతో నిండిపోయిన ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, వైద్య శాఖ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పాదయాత్రలో నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కీర్తి, కొమురయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, వనమల, వెంకటేష్, మహ్మద్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం : కేసు నమోదు

అమీర్‌పేట: మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించి అత్యాచారానికి పాల్పడ్డ బాలుడిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అమీర్‌పేటకు చెందిన బాలిక 10వ తరగతి చదువుకుంటుంది. అదే ప్రాంతానికి చెందిన 18 ఏళ్ల బాలుడు కొంత కాలంగా ప్రేమ పేరుతో వెంట పడుతున్నాడు. ఓ విషయం మాట్లాడాలని చెప్పి ఇటీవల నగర శివారు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం జరిపాడు. రెండు మూడు రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు జరిపిన వైద్యులు బాలిక గర్భం దాల్చినట్లు చెప్పడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు.